# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 25-05-2016**

తెలంగాణ రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో విద్యా సంస్థలు నడవాలని, బోగస్ విద్యాసంస్థ ఒక్కటి కూడా ఉండవద్దనేది, బాగా నడిచే ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా సంస్థలపై జరుగుతున్న విజిలెన్స్ దాడులు కొనసాగుతాయని, ఆ విచారణలో వెలుగులోకి వచ్చిన లోటుపాట్లను సవరించుకోడానికి విద్యాసంస్థలకు అవకాశం కల్పిస్తామని, కావాల్సినంత గడువు ఇస్తామని స్పష్టం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలను మూసి వేయడం ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని, రాష్ట్రంలో అత్యున్నత విద్యను అందించే ప్రక్రియలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పని సరి అని సిఎం అన్నారు. బోగస్ విద్యాసంస్థలను ఖచ్చితంగా ఏరివేస్తామని, విద్యార్థులే లేకుండా కాలేజీలను నడపడం దారుణమని, ఇది రాష్ట్రానికి మంచి పేరు తేదని సిఎం అన్నారు.

ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డి.లో ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంపి వినోద్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యాసంస్థలు శాస్త్రీయంగా ఆలోచన చేసి విద్యార్థులకు పనిదొరికే కోర్సులను అందించే విధంగా ఆలోచించాలని సిఎం చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశం లేకున్నా, వేలంవెర్రిగా ఒకే కోర్సును విద్యార్థులంతా చేయడం వల్ల నిరుద్యోగ సమస్య తలెత్తుతున్నదని చెప్పారు. భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాల్లో ఏమైనా లోటుపాట్లుంటే వాటిని సరిదిద్దుకోవడానికి తగినంత సమయం ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. విద్యాసంస్థలకిచ్చే కరెంట్ ను కమర్షియల్ నుంచి జనరల్ కేటగిరికి మార్చడం, ఆస్తి పన్ను మినహాయింపు తదితర డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

తెలంగాణలో విద్యావిధానం ఎలా వుండాలి? ఏ కోర్సులుండాలి? ఇంకా ఏ కాలేజీలు పెట్టుకోవాలి? విద్యార్థులకు ఇంకా ఏమి చేయాలి? ప్రైవేటు విద్యా సంస్థలకు ఏమి కావాలి? తదితర విషయాలపై విద్యా సంస్థల ప్రతినిధులు కూలంకశంగా చర్చించి, ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని సిఎం చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థలను కలుపుకుని తెలంగాణలో మంచి విద్యా విధానం తేవాలన్నది తమ లక్ష్యమని సిఎం చెప్పారు. తెలంగాణను ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దుదామన్నారు. కోర్సులు, కాలేజీలు కూడా ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ కావాలని సిఎం చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా విద్యార్థులు, అధ్యాపకుల రేషనలైజేషన్ కావాలని కోరారు.

**సిపిఆర్ఓ టు సిఎం**